క్లుప్తంగా

ఎమ్మెల్సీ విజయోత్సవ వేడుకలో అపశ్రుతి

కాట్రేనికోన: మండలంలోని చెయ్యేరు సెంటరులో మంగళవారం రాత్రి జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ వేడుకలలో బాణసంచా పేలి పలువురు గాయపడ్డారు. కూటమి బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాభత్తుల రాజశేఖర్ విజయం సాధించడంతో అభిమానులు భారీగా బాణసంచా కాల్చారు. చెయ్యేరులో తారాజువ్వ టీ టైమ్ సెంటరులో దాచి ఉంచిన మందు గుండు సామగ్రిపై పడటంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు.

ఎస్ఐకు సత్కారం



ఎస్ఐ రమేష్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ బుల్లియ్య, తదితరులు

ఉప్పలగుప్తం: ఇటీవల సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామం గోపవరం గ్రామానికి వచ్చిన ఎస్ఐ తాళ్ల రమేష్‌కు స్థానిక సర్పంచ్ కుంచే బుల్లియ్య, కిత్తనచెరువు సర్పంచ్ కుంచే గౌరీ బుధవారం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంచే బుల్లియ్య మాట్లాడుతూ ఎస్ఐగా ఉద్యోగం సాధించడం గ్రామానికి గర్వకారణమని, బాధ్యత గల ఉద్యోగంలో ప్రజలకు సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కుంచే స్వామి, ములపర్తి దుర్గాప్రసాద్, దోనిపాటి అభిమన్యుడు, కాకర బాలాజీ, తాళ్ల రాంబాబు, కుంచే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం అయినాపురానికి చెందిన ఇళ్ల సూర్య వెంకట నాగ మల్లేశ్వరరావు మామిడికుదురు జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గత గురువారం సాయంత్రం మోటారు సైకిల్‌పై అతను తన ఇంటికి వస్తుండగా బొండాయి కోడు తూము వద్ద ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయ పడ్డాడు. కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగమల్లేశ్వరరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

స్కిల్‌గేమ్స్‌కు కోర్టు అనుమతి

యానాం: చారిత్రక భూసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ వరకు వివిధ వాహనోత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలకు మద్రాసు హైకోర్టు అనుమతినిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్కిల్‌గేమ్స్‌కు అనుమతివ్వాలంటూ దరియాలతిప్పకు చెందిన మెల్లం శ్రీనివాసరావు, యానాం పట్టణంకు చెందిన మన్నే వెంకటేశ్వరరావు మద్రాసు హైకోర్టులో రిట్‌పిటీషన్ దాఖలు చేశారు. కేసును విచారించిన కోర్టు నాదస్వరం, మ్యూజికల్ బ్యాండ్‌తో పాటు స్కిల్‌గేమ్స్‌ను చివరి మూడు రోజులు ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహించుకోవచ్చని అనుమతించాలని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ కు ఆదేశాలు జారీచేసింది.

ధ్యానంతో మానసిక వికాసం

అల్లవరం: ప్రతి రోజూ యోగా చేయడం విద్యార్థుల్లో మానసిక వికాసానికి దోహదం చేస్తుందని హెచ్‌ఎం జీఎస్‌వీ రమణ అన్నారు. హెచ్‌ఎం అధ్యక్షతన బుధవారం జరిగిన కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు మట్టపర్తి ఉమామహేశ్వరీ రూ.5 వేలు విలువైన 101 యోగా మ్యాట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ యోగా అంటే శరీరం, మనస్సు, శ్వాసను సమన్వయం చేసే అభ్యాసమన్నారు. ధ్యానం విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వం, సక్రమమైన ఆలోచన విధానం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ రీసర్వే సమర్థవంతంగా నిర్వహించండి



చల్లపల్లిలో భూ రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ఉప్పలగుప్తం: భూ రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన చల్లపల్లిలో జరుగుతున్న భూ రీసర్వేను బుధవారం ఆర్డీవో మాధవి పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇదే గ్రామ పంచాయతీ జగ్గరాజుపేట ఎంపీపీ పాఠశాలలో ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆర్డీవో మాధవి, సర్పంచ్ ఇసుకపట్ల జయమణితో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో ఆర్డీవో మాధవి సమావేశంలో పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ వీఎన్ దివాకర్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

పరాయి పంచన.. సర్కారు సేవలు

- సొంత గూడు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి
- ఇరుకు గదుల్లోనే విధులు



అద్దెభవనంలో కొనసాగుతున్న ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం



అద్దెభవనంలో బీసీ బాలుర వసతి గృహం

ముమ్మిడివరం: సొంత గూడు లేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంతభవనాలు లేక అద్దె భవనంలోనే ప్రజలకు సేవలందిస్తున్నాయి. ప్రధాన శాఖలైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైయిజ్, మత్స్యశాఖ, బీసీ వసతి గృహం, గృహనిర్మాణశాఖ నిత్యం రద్దీగా ఉండే కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. దీంతో అధికారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదాయం మిన్న.. సొంతగూడు సున్నా..

లక్షలాది రూపాయల ఆదాయం సమకూర్చే ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ కార్యాలయం పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలకు చెందిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. అక్రమ వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనాలను భద్రపర్చుకొనే దారి లేక ఆరు బయటే వదలేస్తున్నారు. ఈ భవన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

అద్దెభవనంలో..

గృహనిర్మాణ శాఖకు గూడు కరువైంది. ఆ శాఖ డీఈ కార్యాలయం ప్రైవేటు భవనంలో కొనసాగుతుంది. ఈ కార్యాలయం పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలలో వేలాది మంది లబ్ధిదారులు ఈ కార్యాలయం ద్వారానే ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. భవనాలు లేక గ్రామానికి దూరంగా నెలకు రూ.6 వేలు అద్దె చెల్లిస్తు అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలకే..

ముమ్మిడివరం మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం 1970 నుంచి అద్దె భవనంలోనే ఉంటోంది. ఈ శాఖ ఆధ్వర్యంలో ముమ్మిడివరం మండలంలోని పలు తీర గ్రామాల మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. వేలాది మంది మత్స్యకారులు వారి సంక్షేమ పథకాలు, సద్వినియోగం చేసుకోవడానికి కార్యాలయానికి వస్తుంటారు. సొంతభవన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

అరకొర వసతుల మధ్య..

స్థానిక బీసీ బాలుర హాస్టల్ గత కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇరుకు గదులలోనే విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. వేలకు వేలు అద్దె చెల్లిస్తున్నా అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. 80 మంది విద్యార్థులకు సరైన మరుగు దొడ్లు,స్నానపు గదులు లేవు.

చిన్నారులకు కిట్ల అందజేత



భీమనపల్లిలో చిన్నారులకు కిట్లు అందిస్తున్న సర్పంచ్ రాజ్‌కుమార్, రమణారావు తదితరులు

ఉప్పలగుప్తం: భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాదరక్షలు సాక్స్‌ల కిట్లను వితరణ చేశారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గుడ్‌సీడ్ ఫౌండర్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రమణారావు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మట్టపర్తి రమాదేవి, పాఠశాల హెచ్‌ఎం గాలి దేవర కృష్ణారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.నాగకుమారి, కె.విజయలక్ష్మి, ఎస్.మీరాబాయి, కె.ఎ.సత్యవతి, ఎన్‌వీఎల్ నరసాయమ్మ, టి.తులసిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లారీల సిబ్బందే ఆశీలు చెల్లించాలి

- వ్యాపారులకు సంబంధం లేదు
- మున్సిపల్ కమిషనర్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ వినతిపత్రం

అమలాపురం టౌన్: మార్కెట్‌లో ఆశీల పన్నును లారీల సిబ్బందే చెల్లించాలని, ఇందులో వ్యాపారులకు ఎలాంటి సంబంధం లేదని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజుకు వివరించారు. ఈ వివాదంపై గత కొంత కాలంగా సాగుతున్న అంశంపై వ్యాపారులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుతో బుధవారం మరోసారి సమావేశమై చర్చించారు. ఆశీల పన్నుల చెల్లింపులో వ్యాపారులకు సంబంధం లేదని కొందరు వ్యాపారలు హైకోర్టును ఆశ్రయించగా స్టే కూడా ఇచ్చిందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ కమిషనర్‌కు వివరించారు. హైకోర్టు స్టే కాపీలను కూడా కమిషనర్‌కు అందించారు. ఇదే అంశంపై చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ అల్లాడ స్వామినాయుడు వ్యాపారుల సమక్షంలోనే కమిషనర్‌తో ఫోన్ మాట్లాడారు. దీనిపై కమిషనర్ తమకు రెండు సమయం ఇవ్వాలని వ్యాపారులను కోరారు. అనంతరం ఆశీల వసూళ్లలో వ్యాపారులకు సంబంధం లేదంటూ వ్యాపార సంఘాల ప్రతినిధులు చాంబర్ తరఫున కమిషనర్ రాజుకు వినితిపత్రం అందించారు. చాంబర్ ఫౌండర్ గోకరకొండ హరిబాబు, చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, ముఖ్య సలహాదారు కంచిపల్లి అబ్బులు, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు రేపాక వెంకన్నబాబు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, వ్యాపార ప్రతినిధులు ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, అల్లూరి మధువర్మ, చింతలపూడి సత్తిబాబు తదితరులు కమిషనర్ రాజుతో ఆశీల వివాదంపై చర్చించారు.



మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు

బీఎస్‌పీ మహా సదస్సును విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: ఈనెల 10న విజయవాడ వెన్యూ ఫంక్షన్ హాలులో జరగనున్న బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) కార్యకర్తల మహా సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీ భవాని పిలుపునిచ్చారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న బీఎస్‌పీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఉన్న బహుజనులు అధిక సంఖ్యలో ఈ మహా సదస్సులో పాల్గొనేందుకు విజయవాడకు తరలివెళ్లాలని లక్ష్మీ భవాని విజ్ఞప్తి చేశారు. సదస్సుకు రాజ్యసభ సభ్యుడు, పార్టీ జాతీయ సమన్వయకర్త రాంజీ గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరువుతున్నారని ఆమె చెప్పారు. అనంతరం విజయవాడలో జరిగే పార్టీ మహా సదస్సు పోస్టర్లను బీఎస్‌పీ నాయకులు విడుదల చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్ మోషే, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, అమలాపురం నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బుడితి దయా మహేష్, ప్రధాన కార్యదర్శి జీఎస్‌డీ రాజు తదితరులు పాల్గొన్నారు.



బీఎస్‌పీ మహా సదస్సు పోస్టర్ విడుదల చేస్తున్న ఆ పార్టీ జిల్లా నాయకులు

ఒత్తిడి లేకుండా చదువుల్లో రాణించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారి విజయశ్రీ

అమలాపురం టౌన్: అమలాపురం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ×సేవ్ ద చిల్డ్రన్స్, ఎడ్యుకేషన్ చిల్డ్రన్స్₹ అనే అంశంపై బేటీ పడావో.. బేటీ బచావో పేరిట విద్యార్థినులకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు అమలాపురం ఐడీడీఎస్ అధికారి విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా చదువుల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. యువకుల వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి సదస్సులో విద్యార్థినులను మానసిక వికాసంపై పలు సూచనలు చేశారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్ అధ్యక్షత వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహరావు, ఏవో కరాటం ప్రవీణ్, సీనియర్ అధ్యాపకులు యాలంగి వరప్రసాద్, ఎస్.సంసోను తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల కళాఖండాలు అద్భుతం

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: కొబ్బరి చిప్పలతో తయారు చేసిన కళాఖండాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం అమలాపురం మండల మహిళ సమైక్య కార్యాలయంలో కొబ్బరి ఆధారిత చేతి కళల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి తయారు చేసిన కళాఖండ వస్తువులను పరిశీలించారు. కొబ్బరి చిప్పలను ఉపయోగించి గిన్నెలు, స్పూన్లు, దీపాలు, బొమ్మలు, అలంకరణ వస్తువులు ఇతర గృహోపకరణాలు తయారీ విధానం ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టేలా ఉన్నాయన్నారు. కొబ్బరి కాయలను ఉపయోగించి బొమ్మలు, అలంకరణ వస్తువులు, ఇతర కళాఖండాలు తయారు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ డీపీఎం కృష్ణవేణి ప్రసాదు, మాస్టర్ ట్రైనింగ్ పాల్గొన్నారు.



కళా ఖండాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

శ్రీనివాసులు విజయం ప్రభుత్వానికి చెంప పెట్టు

ఐ.పోలవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలికి ఏపీటీఎఫ్ బలపరిచిన గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపు ప్రభుత్వానికి చెంప పెట్టు అని జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శిలు ఎస్.ఎన్.మునేశ్వరరావు, యు.వెంకట్రావులు అన్నారు. ఐ.పోలవరం ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భావ సారూప్యం కలిగిన ఉపాధ్యాయ సంఘాలన్నీ సమష్టిగా కృషి చేసి విజయం సాధించడంపై అభినందనలు తెలియజేసారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఇంటీరియల్ రిలీఫ్ ఫండ్ (ఐఆర్) ప్రకటించలేదని, పాత బకాయలు ఊసేలేదని, ఎంతసేపూ బదిలీల హడావుడి తప్ప ఉద్యోగులకు ఒరిగిందేమీలేదని వారు విమర్శించారు. రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణతోపాటు పలువురు గాదే శ్రీనివాసుల నాయుడుని అభినందించారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ నాయకుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం కాలభైరవస్వామి ఆలయం వద్ద శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఆందోళన చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భక్తుల సౌకర్యార్థం రూ.15 లక్షల వ్యయంతో సిమెంటు రహదారిని వేయగా దానికి సంబంధించిన శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేయడం దారుణమన్నారు. దీనిని తీవ్రమైన చర్యగా భావిస్తున్నామన్నారు. దీనికి బాధ్యులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలన్నారు. ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశఋరు. అనంతరం కోరంగి ఎస్సై పి.సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాడి శ్రీను, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, దడాల జగదీశ్వరరావు, పెట్ల సూర్యనారాయణరాజు, వెంటపల్లి నూకరాజు, పేర్ని ఆదినారాయణమూర్తి, అంకాడి అంజిబాబు, రత్స ముత్యాలు, పోతుల రత్నకుమారి, సంగాడి శ్రీను, మట్టా లింగమూర్తి, నరాల హేమసుందర్, కొటికెలపూడి చందు, గెద్దాడ బూరియ్య, అన్నిబాబు, పెస్సంగి వర్మ, నీలపాల శ్రీను, కడలి శ్రీను, గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో ఆందోళన చేస్తున్న నాయికులు

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడాపోటీలు

యానాం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వివిధ క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక మహాత్మా గాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన క్రీడాపోటీలకు నియోజకవర్గ పరిధిలో ని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు, స్థానిక ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగ పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దివ్యాంగులకు ట్రైసైక్లింగ్, పరుగుపందెం, మ్యూజికల్ చైర్స్, షాట్‌పుట్ తదితర అంశాల్లో పోటీలను నిర్వహించారు. అనంతరం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

డంపింగ్ యార్డుకు తక్షణం స్థలం కేటాయించాలి

యానాం: డంపింగ్‌యార్డుకు స్థలాన్ని కేటాయించకపోవడంతో గత కొన్ని రోజులుగా అపారిశుధ్యంతో తాండవిస్తోందని మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డంపింగ్‌యార్డు సమస్య ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగజేస్తుందని, అధికారులు త్వరగా డంపింగ్ యార్డు స్థలం చూపించాలని అన్నారు. మునిపాలిటీకి పారిశుధ్య బాధ్యతను అప్పగించాలని తగిన సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

మ్యాజిక్ ఫ్యామిలీ పెళ్లి ఆహ్వాన ప్రోమో ప్రారంభం

అమలాపురం రూరల్: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన కేంద్ర యువజన అవార్డు గ్రహీత లండన్ ఫిజియోథెరపీస్ట్ చింతా మోహిత్ కృష్ణకు బండార్లంకకు చెందిన సాయి సీతకు ఈ నెల 12వ తేదీన వివాహం జరగనుంది. ఈ సందర్భంగా ఆహ్వాన ప్రోమోను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ప్రారంభించారు. ఒకటి కాబోయే ఈ యువజంట 100 రోజుల కల్యాణ సేవా కార్యక్రమాలను పత్రికలో ముద్రించారు. ఉభయ రాష్ట్రాలలో చేసిన వైద్య సేవలు, అవగాహన బ్లైండ్ ఫోల్డ్ ర్యాలీలు, పేదలకు చేయూత వంటి కార్యక్రమాలతో పాటు ఆహ్వాన పత్రికలో మొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ ఒక పేజీలో ముద్రించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. వివాహ కార్డ్‌తో మొక్కలను పెంచుతున్నట్లు మోహిత్ తండ్రి ప్రముఖ ఇంద్రజాలికుడు శ్యామ్ జాదుగర్ కలెక్టర్‌కు వివరించగా మూడు మతాలు సమానమంటూ పెళ్లి ఆహ్వాన ప్రోమో విడుదల చేసిన యువజంట కలెక్టర్ అభినందించారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

ప్రైవేటు ఉద్యోగుల నిరసన

ఉప్పలగుప్తం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సమగ్రశిక్షా ప్రైవేటు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొన్ని డిమాండ్లతో బుధవారం మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో సమగ్ర శిక్షా కార్యాలయం ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలనే నమ్ముకున్న ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. వాటిలో ప్రధానంగా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి ఇతర సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, వేతనాలు పెంపు, ఈపీఎఫ్, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబు చార్ట్, పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర డిమాండ్లతో నిరసన చేపట్టారు. వీటి పరిష్కరించాలని కోరారు. ఈ నెల 11వ తేదీన విజయవాడ కేంద్రంగా నిరసన దీక్ష చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయంపై నిరసన దీక్ష చేపడుతున్నామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ గంగాధర్ రావు, జనిపల్లి అశోక్ కుమార్, కుంచే సత్తిబాబు, వెంకటేష్, కె.వెంకటేశ్వరరావు, పండు మురళి, ఎస్.వెంకట్రావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమ్మె కాలపు ఒప్పందాలను తక్షమే అమలు చేయాలని కోరుతూ కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ నెల 8 మహిళా ఉద్యోగులు సదస్సు నిర్వహించి తీర్మానం చేస్తామన్నారు. మార్చి 11న విజయవాడ కేంద్రంగా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై నిరసన కార్యక్రమం చేపడుతామని సీఆర్‌పీ మండల అధ్యక్షులు వెంకటశెట్టి, పీటీఐ ఉద్యోగులు కార్యదర్శి ప్రసాదు, శేఖర్, వరలక్ష్మీ, అంగా భవాని తదితరుల పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

8 మంది అరెస్టు

తాళ్లరేవు: గంజాయి సేవించడానికి అలవాటు పడి, సరకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న 8 మందిని కోరంగి పోలీసులు బుధవారం అరెస్టు చేసారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలోని నాని లేబౌట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి ప్రాంగణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుతో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పింపల గూడకు చెందిన పాంగి గోవింద్, కాకినాడ గోలీలపేటకు చెందిన చింత వీరవెంకట సత్యనారాయణ, మండల పరిధిలోని గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామానికి చెందిన కర్రి వీరవెంకట సురేంద్ర, పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కర్రి గంగాధర్, పాలెపు సతీష్, పెదవలసలకు చెందిన చెక్కా రాజేష్, చినబొడ్డు వెంకటాయపాలేనికి చెందిన సంగాడి దుర్గా మల్లేశ్వరరావు, కర్రి ఆదివిష్ణులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచి నిందితులకు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల సబ్ డివిజనల్ పోలీసు అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.



సీతారామపురంలో గంజాయితో పట్టుబడ్డ నిందితులతో కోరంగి పోలీసులు